జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

- గ్రామాల్లో ఏపీకి జగనే ఎందుకు కావాలి? కార్యక్రమానికి స్పందన
- ఇంటింటికీ నేతలు వెళ్లి ప్రభుత్వ పథకాలు, సంక్షేమం గురించి వివరణ


47వ డివిజన్‌లో సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

గుంటూరు రూరల్: రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే మరలా ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కావాలని అర్బన్ క్లస్టర్- 2 కన్వీనర్ బండారు శ్రీనివాసరావు తెలిపారు. నగర శివారుల్లోని 47వ డివిజన్ 183వ సచివాలయం పరిధిలో డివిజన్ కన్వీనర్ జల్లేపల్లి వేణుబాబు ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి? అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకూ సచివాలయం పరిధిలో జగనన్న అందించిన సంక్షేమ పథకాల పట్టికను ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. డివిజన్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. నేటి వరకూ డివిజన్ పరిధిలో కోట్ల రూపాయల్ని సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు నేరుగా వారి ఖాతాల్లో వేసినట్లు చెప్పారు. చంద్రబాబు హయాంలో కేవలం ఒక వర్గానికి మాత్రమే పథకాలు అందేవని, మరలా ఆయన ప్రజల్ని మోసం చేసేందుకు దత్తపుత్రుడితో కలసి కుట్రలు పన్నుతున్నాడని తెలిపారు. ప్రజలు మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవడానికి సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు రాచకొండ ముత్యాల నాగరాజు, కిశోర్, శ్రీను, ప్రసాద్, జయరాజు, దుంపాల రాధ, అంకమ్మరావు, చంటి, పథకాల లబ్ధిదారులు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగనన్న

పొన్నూరు: గత ప్రభుత్వ హయాంలో లేనివిధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పొన్నూరు పట్టణం అభివృద్ధి చెందిందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఎం.ఎ.మొహమ్మద్ తెలిపారు. పట్టణంలోని 24, 26 వార్డుల పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల్ని వైఎస్సార్ సీపీ నేతలు వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ముందుగా వార్డులో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎస్సీ కాలనీలోని సచివాలయంలో వార్డులో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల వివరాలతో ప్రదర్శించిన బోర్డును నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, నాయకులు కొల్లేరు శ్రీనివాసరావు, ఎం.అనిత, డి.గోపి, షేక్ షర్మిల, జి.సంజీవ్, పి.పిచ్చయ్య, పి.పోతురాజు, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


పెదపాలెంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరిస్తూ కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

పెదపాలెంలో...

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాల్ని అమలుచేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే సీఎం ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదపాలెం గ్రామ సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన వారి వివరాలతో ప్రదర్శించిన బోర్డును ఆవిష్కరించారు. ముందుగా గ్రామంలోని సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, సర్పంచ్ శివపార్వతి, పార్టీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, ఎంపీడీవో శ్రీనివాసరావు, నాయకులు సర్దార్, మనోహర్, దాసరి శివరామకృష్ణ, నాగప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.


పొన్నూరులో జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్

సంక్షేమంలో అగ్రగామిగా ఏపీ



ప్రత్తిపాడు: సంక్షేమంలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి తెలిపారు. వంగిపురం గ్రామ సచివాలయం వద్ద బుధవారం సాయంత్రం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నాగిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లక్ష్మారెడ్డి హాజరయ్యారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రామంలో జరిగిన సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారుల వివరాల్ని వెల్లడించారు. అనంతరం సంక్షేమ పథకాల ప్రదర్శన ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని తెలిపారు. రాష్ట్రమంతా మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి జగన్ ను గెలిపించాలని కోరారు.

వలంటీర్లు బాధ్యతగా వ్యవహరించాలి

గ్రామాల్లో వలంటీర్లు బాధ్యత గా వ్యవహరించాలని లక్ష్మారెడ్డి చెప్పారు. కొన్ని గ్రామాల్లో వలంటీర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, అది మంచి పద్ధతి కాదని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉన్న వలంటీర్ల వ్యవస్థ క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొలాల్లో నీటిని వెంటనే బయటకు పంపాలి



బోడిపాలెం(కాకుమాను): మిచాంగ్ తుఫాన్ కారణంగా పంట పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే బయటకు పంపాలని ఏవో కె.కిరణ్మయి రైతులకు సూచించారు. మండలంలోని బోడిపాలెం, కోతివానిపాలెం గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన వరి పొలాల్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేల వాలిన వరి పైరును పైకి లేపి కట్టలుగా కట్టాలని తెలిపారు. నిలబెట్టిన పంటపై 5శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని, దీనివల్ల గింజలు మొలకెత్తకుండా ఉంటాయని ఆమె సూచించారు. గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది పంట నష్ట పరిహారం అంచనాల్ని నమోదు చేస్తున్నారని, రైతులు సిబ్బందిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవుని నమ్మిన వారికి విజయాలు సొంతం



గుంటూరు రూరల్: దేవుని నమ్మిన వారికి విజయాలు సొంతమవుతాయని ఎక్సైజ్ మాజీ అసిస్టెంట్ కమిషనర్ ఆనందరాజు తెలిపారు. మండలంలోని వెంగళాయపాలెంలో హోలీ స్పిరిట్ ఫౌండేషన్, హోలీ మినిస్ట్రీస్ ఫౌండర్ కలిమల పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన 147వ అమావాస్య ప్రత్యేక ప్రార్థన కూడికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏసుక్రీస్తు లోకంలోని ప్రజల పాపాల్ని శుద్ధి చేసి ఆయన్ను నమ్మిన వారికి పరలోక రాజ్యం కల్పిస్తాడని తెలిపారు. క్రీస్తుని నమ్మినవారికి ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. ఆయన సన్నిధిలో ప్రజలు సంతోషంగా జీవిస్తారని పేర్కొన్నారు. అనంతరం మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 100 మంది వితంతువులకు చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోలీ స్పిరిట్ ఫౌండేషన్ సెక్రటరీ ఇస్రాయిల్ సత్య ప్రకాష్, కలిమెల పురుషోత్తం, మేరక్క, క్రీస్తుని భక్తులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' క్రీడా మైదానాల పరిశీలన



గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి అవసరమైన అన్ని సౌకర్యాల్ని కల్పించినట్లు ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. మండలంలోని వెంగళాయపాలెంలో క్రీడా మైదానాల్ని బుధవారం ఆయన పరిశీలించారు. క్రీడాకారులు, సిబ్బందికి అవసరమైన ఏర్పాట్ల గురించి కార్యదర్శులకు సూచనలు చేశారు. అనంతరం సచివాలయాల్ని సందర్శించారు. సిబ్బందికి, కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, వెంగళాయపాలెం పంచాయతీ కార్యదర్శి ఆంజనేయ ప్రసాద్, సర్పంచ్ లలిత కుమారి ఎంపీపీ యూపీ స్కూల్ పీఈటీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు వైద్య పరీక్షలు



చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు లలిత పరమేశ్వరి స్పిన్నింగ్ మిల్లు వద్ద బుధవారం సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్, తెనాలి నేత్రాలయ ఐ కేర్, శివ డెంటల్ కేర్ మల్టీస్పెషాల్టీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నేత్రాలయ ఐ కేర్ వైద్యులు షేక్ సైదా మాట్లాడుతూ కళ్లు ఎండిపోవడం, మంట, దురద, చూపు మసకబారడం, కాంతిని తట్టుకోలేకపోవడం, కళ్లు అలసిపోవడం వంటివి పొడిబారటానికి సంబంధించిన లక్షణాలని తెలిపారు. వయసు రీత్యా మగవారిలో కన్నా మహిళల్లో ఎక్కువగా కనిపిస్తాయని, వైద్యుల్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. జనరల్ మేనేజర్ బి. వెంకన్న, శివ డెంటల్ కేర్ మల్టీ స్పెషాలిటీ వైద్యులు హరిప్రియ యార్లగడ్డ, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, గోపీనాథ్, వైద్య సిబ్బంది శ్రీలత పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల విస్తృత తనిఖీలు

198 మంది నుంచి రూ 9.63 లక్షల అపరాధ రుసుం వసూలు


తనిఖీల వివరాలను వెల్లడిస్తున్న విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు

గుంటూరు రూరల్: విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం విస్తృత తనిఖీల్ని చేపట్టారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.పి.ఈ. సూర్యప్రకాష్, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో 56 మంది అధికారులు, 120 మంది సిబ్బంది 56 బృందాలుగా ఏర్పడి 4,312 సర్వీసుల్ని తనిఖీ చేశారు. నగర శివారుల్లోని చౌడవరం, దాసరిపాలెం, చల్లావారిపాలెం, అంకిరెడ్డిపాలెం, పాత్తూరు, లాలుపురం గ్రామాల్లో చేపట్టిన తనిఖీల్లో అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 198 మందికి రూ 9.63 లక్షల అపరాధ రుసుం విధించారు. అనుమతించిన దానికి బదులుగా ఇతర కేటగిరిలో విద్యుత్ వినియోగిస్తున్న ఒకరికి రూ 10వేలు, అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 194 మందికి రూ 9.31 లక్షలు, అసలైన వినియోగం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన మూడు సర్వీసుల్ని గుర్తించి రూ. 22 వేలు అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. వినియోగదారులంతా మీటర్లకు సీలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. తుప్పు పట్టిన లేదా సీలు ఊడిన వెంటనే సంబంధిత విద్యుత్ అధికారికి సిబ్బందికి తెలియజేయాలన్నారు. విద్యుత్ చౌర్యం గురించి 9440812263, 9440812360, 9440812361 నంబర్లకు నేరుగా వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడుల్లో డీఈఈలు ఎం. రవికుమార్, కె. రవికుమార్, బి. రాజమోహన్, ఏఈలు కె. కోటేశ్వరరావు, ఏ. చంద్రశేఖర్, బ్రహ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహనకు మొబైల్ కేంద్రాలు

- నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తి చేకూరి
- ఫిబ్రవరి నెలాఖరు వరకు నగరంలో అందుబాటులో వాహనాలు


అవగాహన వాహనాలను ప్రారంభిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ఓటర్లకు ఈవీఎం, ఓటర్ వెరిఫికేషన్, పేపర్ ఆడిట్‌పై అవగాహన కలిగించేందుకు ప్రత్యేకంగా మొబైల్ కేంద్రాల్ని అందుబాటులోకి తెచ్చినట్లు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం అవగాహన వాహనాల్ని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఓటర్లకు ఎల్రక్టానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం), ఓటర్ వెరిఫికేషన్, పేపర్ ఆడిట్‌పై అవగాహన కలిగించడానికి ఇప్పటికే నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, బృందావన్ గార్డెన్స్‌లోని సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాల్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు ఓటుపై క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించేందుకు మొబైల్ వాహనాల్ని కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వాటిల్లో ఈవీఎంలు ఉంటాయన్నారు. నగరంలోని ప్రధాన కేంద్రాల్లో ప్రజలకు వాటిపై ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వాహనం వెంబడి పోలీస్ బందోబస్త్ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉండి ఈవీఎం ద్వారా ఓటు వేయడం, సరి చూసుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని ఆమె పేర్కొన్నారు. వాహనాలు ఫిబ్రవరి నెలాఖరు వరకు ఉంటాయని, నగరంలోని రెండు నియోజకవర్గాల ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటర్లు తమ ఓటుకు సంబంధించిన ఏ సందేహం ఉన్నా తీర్చడానికి వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. తూర్పు నియోజకవర్గానికి 0863-2345104, పశ్చిమ నియోజకవర్గానికి 0863- 2345105 నంబర్లను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా ఆపరేటర్లను నియమించామని తెలిపారు. ఓటర్లు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:30 గంటలలోపు ఫోన్ చేసి తమ ఓటుకి సంబంధించి ఏ సందేహం ఉన్నా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, ఏఈఆర్‌వోలు సీహెచ్. శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ శివన్నారాయణ పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

మేయర్ కావటి మనోహర్‌నాయుడు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి, నేతలు

నెహ్రూనగర్: నగరంలో శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. తూర్పు నియోజకవర్గం 50వ డివిజన్‌లోని శారదా కాలనీ ప్రధాన రహదారిని బుధవారం రూ. 1.21 కోట్లతో సీసీ రోడ్డుగా నిర్మించేందుకు స్థానిక కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమాతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణం చేపడితే స్థానిక ప్రజలకే కాక, మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు వైపు, అమరావతి రోడ్డు వైపు వెళ్లేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. ఇప్పటికే సదరు ప్రాంతంలోని సైడు కాలువలు నిర్మాణం పూర్తయిందని, రోడ్డు మార్జిన్లలో ఆక్రమణల్ని తొలగించి, రోడ్డు విస్తరించి రూ.1.21కోట్లతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని వివరించారు. నగరంలో అన్ని వార్డులలో అభివృద్ధి పనులు కుల,మత, ప్రాంత, పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు రాజేష్ పాల్గొన్నారు.



వివిధ వేషధారణలలో చిన్నారులు

భళా... బాలోత్సవ్!

వీవీఐటీలో మూడు రోజుల పాటు వైభవంగా జరిగిన బాలోత్సవ్ -2023 వేడుకలు బుధవారం ముగిశాయి. చివరి రోజు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులు పలు వేషధారణల్లో 'జిగేల్' మన్నారు. జానపద నృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. బాలబాలికల తీపి గుర్తులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధురానుభూతుల మధ్య వేడుకలు కోలాహలంగా ముగిశాయి - పెదకాకాని


మట్టి బొమ్మల తయారీలో చిన్నారులు




విద్యార్థినుల నృత్య ప్రదర్శన



108లో మహిళ ప్రసవం



చేబ్రోలు: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనంలో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో ప్రసవం జరిగిన సంఘటన చేబ్రోలు మండలంలో బుధవారం జరిగింది. వేజండ్ల గ్రామానికి చెందిన డి. నీరజకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. సిబ్బంది ఆమెను తీసుకొని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో నొప్పులు అధికమవ్వంతో వాహనాన్ని పక్కన నిలిపి ప్రసవం చేశారు. నీరజకు మగ శిశువు జన్మించాడు. మొదటి కాన్పులో కూడా ఆమెకు మగశిశువు జన్మించాడు. తల్లీబిడ్డలకు 108 సిబ్బంది జి. ఇందిర, సీహెచ్. సాంబశివరావు అత్యవసర వైద్య సేవలు అందించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.